క్లుప్తంగా

నిలిచిన బల్క్ మిల్క్ సెంటర్ పనులు



పూర్తి చేయాల్సిన బల్క్ మిల్క్ సెంటర్

దత్తిరాజేరు: మండలంలోని పోరలి రైతుసేవా కేంద్రం పక్కన నిర్మిస్తున్న బల్క్ మిల్క్‌సెంటర్ పనులు మధ్యలో నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తయినా పనులు పునఃప్రారంభించేందుకు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. సెంటర్ పనులు పూర్తయితే పాడిరైతులకు మేలు జరుగుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పనులు పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు.

సొంత నిధులతో గ్రావెల్ రోడ్డు



మట్టి రోడ్డుపై గ్రావెల్, క్రషర్ వేయిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు వెంకటరమణ

గుర్ల: మండల కేంద్రలలోని రాజాలమ్మ తల్లి కోవెలకు వెళ్లే రహదారి అధ్వానంగా ఉండడంతో వైఎస్సార్‌సీపీ నాయకుడు మంత్రి వెంకటరమణ రూ. 20 వేలతో రోడ్డు వేశారు. ఆదివారం అమ్మవారి జాతర ఉండడంతో భక్తులకు ఇబ్బంది కలగకుండా గ్రావెల్, క్రషర్ బుగ్గి వేసి పనులు చేయించారు.

విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీ



విద్యార్థులకు దుస్తులు అందజేస్తున్న సర్పంచ్ శ్రీదేవి, స్థానిక నేతలు

గుర్ల: సర్వేపల్లి రాధాకృష్ణన్ పేరుతో ప్రభుత్వం అందజేస్తున్న విద్యార్థి మిత్ర కిట్లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని చింతపల్లిపేట సర్పంచ్ జమ్ము శ్రీదేవి సూచించారు. మండలంలోని చింతపల్లిపేట ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శనివారం కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఆర్.శంకరరావు, స్థానిక నేతలు జమ్ము అప్పలనాయుడు, లెంక సూర్యనారాయణ ఉన్నారు.

చురుగ్గా పారిశుధ్య పనులు



తుమ్మికాపల్లి గ్రామంలో పారిశుధ్య పనులు చేయిస్తున్న అధికారులు

కొత్తవలస: మండలంలోని తుమ్మికాపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో సీతంపేట, తుమ్మికాపల్లి గ్రామాల్లో సర్పంచ్ విరోతి కొండలరావు ఆధ్వర్యంలో శనివారం పారిశుధ్య పనులు చేపట్టారు. కాలువల్లో పూడికతీత, ఓవర్‌హెడ్ ట్యాంక్‌ల వద్ద క్లీనింగ్, క్లోరినేషన్, దోమల నివారణ మందు పిచికారీ వంటి పనులు నిర్వహించారు. కార్యక్రమంలో వియ్యంపేట పీహెచ్‌సీ వైద్యసిబ్బంది, ఆశా కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

రెండు వేల మంది గిరిపుత్రులతో పాదయాత్ర



పాదయాత్రగా వెళ్తున్న ట్రస్ట్ చైర్మన్ రాపర్తి జగదీష్‌బాబు

కొత్తవలస: మండలంలోని మంగళపాలెం గ్రామ సమీపంలో గల గురుదేవా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జగన్నాథస్వామి రథయాత్రను పురస్కరించుకుని సుమారు రెండు వేల మంది గిరిపుత్రులతో సింహాచలం పుణ్యక్షేత్రానికి ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీష్‌బాబు శనివారం పాదయాత్రగా బయలుదేరారు. అరుకు, విజయనగరం, ఒడిశా ప్రాంతాల్లోని 60 గ్రామాలకు చెందిన గిరిజనలు పాదయాత్రలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

8న వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశం

శృంగవరపుకోట: వైఎస్సార్‌సీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నెల 8వ తేదీ మధ్యాహ్నం నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎస్.కోట నియోజకవర్గ మాజీ శాసనసభ్యుడు కడుబండి శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ఎరుకమ్మ పేరంటాలు కల్యాణ మంటపంలో నిర్వహించనున్న సమావేశానికి ముఖ్య అతిథిగా పార్టీ జిల్లా అధ్యక్షుడు, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు హాజరవుతారని పేర్కొన్నారు. సమావేశానికి పార్టీ సీనియర్ నాయకులు, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, తదితరులు హాజరుకావాలని కోరారు.

బీసీ రుణాలు మంజూరయ్యేనా...?



ఎంపీడీఓ కార్యాలయం

- మూడు నెలలు గడుస్తున్నా ఇంతవరకూ మంజూరుకు నోచుకోని వైనం
- పెదవి విరుస్తున్న లబ్ధిదారులు

మెరకముడిదాం: కూటమి నాయకులు ఎన్నికల ముందు బీసీలను అన్ని విధాలుగా ఆదుకుంటాం.. ప్రభుత్వం వస్తే బీసీలకు పెద్దపీట వేస్తామని ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చారు. ఎన్నికలు అయిపోయి కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తయింది. అయితే కూటమి నాయకులు ఇచ్చిన హామీ మేరకు ఇంతవరకు బీసీలకు చేసిందేమీ లేదనే చెప్పాలి. బీసీలకు రుణాలు మంజూరు చేసేందుకు మండల పరిధిలో ఉన్న ఆరు బ్యాంకులకు చెందిన అధికారులు, బీసీ వెల్ఫేర్ అధికారులు, మండల స్థాయి అధికారులు కలిసి ఇంటర్వ్యూలు కూడా నిర్వహించారు. అయితే ఈ రుణాలకు సంబంధించి మండలానికి చెందిన 337 మంది దరఖాస్తు చేసుకోగా.. ప్రభుత్వం మాత్రం 84 యూనిట్లు మాత్రమే లక్ష్యంగా ఇచ్చింది. ఈ క్రమంలో ఈ ఏడాది ఏప్రిల్ 2వ తేదీన అధికారులు లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు పూర్తి చేశారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ అనంతరం అధికారులు కేవలం నలుగురు లబ్ధిదారులను మాత్రమే ఎంపిక చేయగా, అందులో ఇద్దరికి మాత్రమే అధికారులు రుణాలు మంజూరు చేశారు. మిగిలిన వారు తమకు రుణాలు మంజూరు చేస్తారో.. చేయరో తెలియక ఎదురుచూస్తున్నారు.



సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేస్తున్న అధికారులు (ఫైల్)

అధికార పార్టీ నాయకుల జోక్యం..

అయితే ఈ రుణాలకు సంబంధించి అధికార పార్టీకి చెందిన రెండువర్గాల నాయకులు కలుగజేసుకుని తమ వారికి రుణాలు కావాలంటే తమ వారికి కావాలని అధికారులపై ఒత్తిడి తీసుకువస్తున్నట్లు సమాచారం. అయితే అధికారులు అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గలేక.. ఎవరికీ రుణాలు మంజూరు చేయలేక తలలు పట్టుకుంటున్నారు. ఇదిలా ఉంటే సామాన్య లబ్ధిదారులు ఈ రుణాలు మంజూరవుతాయని ఎంతో ఆశతో ఎదురు చూస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు రుణాల విషయంలో కాస్త ముందడుగు వేసి నిజమైన లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేయాలని పలువురు కోరుతున్నారు.

మహానేత వైఎస్సార్ జయంతికి తరలిరండి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

- వైఎస్సార్‌సీపీ నాయకులు

చీపురుపల్లి: దేశంలోనే సంక్షేమ పరిపాలనకు ఆదర్శనీయుడు, అందరి గుండెల్లో కొలువై ఉన్న మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలను ఈ నెల 8న ఘనంగా నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మీసాల వరహాలనాయుడు తెలిపారు. శనివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇప్పిలి అనంతం, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు బెల్లాన వంశీకృష్ణతో కలిసి మాట్లాడారు. మహానేత జయంతి సందర్భంగా పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ఉన్న వైఎస్సార్ విగ్రహం వద్ద వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించిన తర్వాత పలు సేవా కార్యక్రమాలు చేపడతామని చెప్పారు.

9న బొత్స జన్మదినం..

ఈ నెల 9న అభిమాన నాయకుడు, శాసన మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ జన్మదిన వేడుకలను చీపురుపల్లిలో గల వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆ సందర్భంగా కేక్ కట్ చేసిన అనంతరం మెగా మెడికల్ క్యాంప్ నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమాలకు నియోజకవర్గంలోని చీపురుపల్లి, గరివిడి, మెరకముడిదాం, గుర్ల మండలాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు దన్నాన జనార్దనరావు, బెల్లాన త్రినాథరావు, పతివాడ రాజారావు, గిరడ రాందాసు, ముల్లు పైడిరాజు, కొసిరెడ్డి రమణ, రౌతు పైడిరాజు, తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర లక్ష్యాల సాధనకు కృషి

- ఎమ్మెల్యే కళా వెంకటరావు

చీపురుపల్లి: వికసిత్ భారత్ – 2047లో భాగంగా స్వర్ణాంధ్ర లక్ష్యాలను సాధనకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమిష్టిగా పని చేయాలని ఎమ్మెల్యే కమిడి కళావెంకటరావు అన్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఇతర అధికారులతో శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో స్వర్ణాంధ్ర – 2047పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదరికం లేని నియోజకవర్గంగా తీర్చిదిద్దాలన్నారు. పేదరిక నిర్మూలన, ఉపాధి కల్పన, నీటి భద్రత, నైపుణ్యాభివృద్ధి, వ్యవసాయ సాంకేతికత, గ్లోబల్ లాజిస్టిక్స్ వంటి పది సూత్రాలను క్షేత్ర స్థాయిలో అమలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఐ.సురేష్, తహసీల్దార్ ధర్మరాజు, టీడీపీ నాయకులు రౌతు కామునాయుడు, దన్నాన రామచంద్రుడు, రెడ్డి గోవింద, తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కళా వెంకటరావు

మా గ్రామాన్ని పంచాయతీగా మార్చండి

- సీతంపేట గ్రామస్తుల వినతి

శృంగవరపుకోట: మా గ్రామంలో జనాభా పెరిగింది.. మా అవసరాలకు తగ్గట్టుగా పాలన సాగడం లేదు.. వెంటనే మా గ్రామాన్ని పంచాయతీగా మార్చాలని మండలంలోని సీతంపేట గ్రామస్తులు కోరారు. ఎస్.కోట పంచాయతీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన గ్రామసభలో అధికారులకు సీతంపేట గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. ముప్పై వేలకు పైగా జనాభా ఉన్న ఎస్.కోట పంచాయతీలో మా గ్రామం విలీనమై ఉందన్నారు. ఇప్పుడు మా గ్రామంలో కూడా వేల సంఖ్యలో జనాభా ఉన్నారు. కాబట్టి మా గ్రామాన్ని పంచాయతీగా ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ సంతోషికుమారి, వైస్ సర్పంచ్ మోపాడ కుమార్, సీతంపేట గ్రామస్తులు సన్యాసప్పడు, చిప్పాడ రమణ, వై.ఈశ్వరరావు, చింతల నారాయణమూర్తి, వై.దేముడు, జగదీష్, తదితరులు పాల్గొన్నారు.



ఎస్.కోట పంచాయతీ కార్యాలయంలో వినతి పత్రం ఇస్తున్న సీతంపేట గ్రామస్తులు

కుమ్మపల్లిలో పంటకోత ప్రయోగం



పంటకోత ప్రయోగం చేస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

వేపాడ: మండలంలోని కుమ్మపల్లి గ్రామంలో మామిడితోటలో నవధాన్యాల సాగు పంటకోత ప్రయోగం శనివారం నిర్వహించారు. గ్రామానికి చెందిన సర్సిపల్లి వెంకటరమణ మామిడి తోటలో నవధాన్యాలు సాగుచేశారు. ప్రకృతి వ్యవసాయం రీజనల్ టెక్నికల్ అధికారి హేమసుందర్ నేతృత్వంలో పంట కోత ప్రయోగం నిర్వహించి దిగుబడి అంచనా వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జూన్ మొదటివారంలో నవధాన్యాలు వేయడం వల్ల ఖరీఫ్‌లో కూరగాయలు, రాగి పంటలకు మేలు జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ సన్యాసమ్మ, ఈశ్వరరావు, మదీనా, సైంటిస్ట్ ధనలక్ష్మి, తదితరుల పాల్గొన్నారు.

ఘనంగా జగన్నాథుడి మారు రథయాత్ర

గజపతినగరం: మండల కేంద్రంలోని రామాలయం అర్చకుడు సుధాకర్ పట్నాయక్ ఆధ్వర్యంలో జగన్నాథుడి మారు రథయాత్ర శనివారం ఘనంగా నిర్వహించారు. జగన్నాథుడి ఉత్సవ మూర్తులను రథంపై ఉంచి గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



జగన్నాథుడి మారు రథయాత్ర

పార్టీ బలోపేతమే లక్ష్యం

శృంగవరపుకోట: గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఒబ్బిన సత్యన్నారాయణ అన్నారు. శనివారం స్థానిక జనసేన కార్యాలయంలో కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గ్రామస్థాయిలో జనసైనికుల వివరాలను సేకరించి, వారిని పార్టీతో అనుసంధానం చేయాలన్నారు. రానున్న స్థానిక ఎన్నికలకు పార్టీని సమాయత్తం చేయాలన్నారు. సమావేశంలో తాండ్రంగి చంటి, మోపాడ కృష్ణబాబు, దొగ్గ రమణ, జి.సతీష్, ఎస్ఎల్‌వీ ప్రసాద్, టి.సంతోష్, జి.ఎర్నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాల వితరణ



విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందిస్తున్న ట్రస్ట్ సభ్యులు

వేపాడ: మండలంలోని వల్లంపూడి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు దొగ్గ మల్లమ్మ సర్వీస్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు శనివారం నోట్‌పుస్తకాలు అందజేశారు. ట్రస్ట్ సభ్యులు మాట్లాడుతూ.. విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విస్తృత స్థాయి సమావేశానికి హాజరుకావాలి

దత్తిరాజేరు: నియోజకవర్గ కేంద్రమైన గజపతినగరంలో సోమవారం జరగనున్న వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశానికి ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, నాయకులు హాజరుకావాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రాపాక కృష్ణార్జున శనివారం ఒక ప్రకటనలో కోరారు. బెల్లాన కన్వెన్షన్‌లో జరగనున్న సమావేశానికి మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, తదితరులు హాజరై కూటమి ప్రభుత్వం చేసిన మోసంపై వివరిస్తారని పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

శృంగవరపుకోట: పట్టణంలోని పుణ్యగిరి ఫీడర్‌లో కొత్త బే ఎక్స్‌టెన్షన్ పనులు చేస్తున్నందున ఎస్.కోట పట్టణ పరిధిలోని తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలు, ప్రభుత్వాస్పత్రి, బర్మా కాలనీ, వైఎస్సార్ కాలనీ, రేగపుణ్యగిరి, అయ్యప్ప లేఅవుట్, పుణ్యగిరి రోడ్డు ప్రాంతాల్లో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 వరకు విద్యుత్ సరఫరా ఉండదని విజయనగరం రూరల్ ఈఈ జి.సురేష్‌బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ముగిసిన వారాహి నవరాత్రి ఉత్సవాలు

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధిలోని బృందావన్ వ్యాలీలో నిర్వహిస్తున్న శ్రీవారాహి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు శనివారం ముగిశాయి. అర్చకులు సంతోష్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో ఉదయం అమ్మవారికి అర్చనలు, అభిషేకం, పూర్ణాహుతి కార్యక్రమాలు చేశారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం చేపట్టి, మూడు వేల మంది భక్తులకు అన్నప్రసాదం అందజేశారు.

బాధ్యతల స్వీకరణ

లక్కవరపుకోట/కొత్తవలస: ఇటీవల సాధారణ బదిలీల్లో భాగంగా కొత్తగా వచ్చిన పంచాయతీ కార్యదర్శులు కొత్తవలస, లక్కవరపుకోట మండలాల్లోని పలు గ్రామ పంచాయతీ కార్యదర్శులుగా శనివారం బాధ్యతలు స్వీకరించారు. లక్కవరపుకోట మండలంలోని ఏడుగురు పంచాయతీ కార్యదర్శులు బదిలీపై వెళ్లగా వారి స్థానాల్లో కొత్త వారు బాధ్యతలు స్వీకరించారు. గంగుబూడి పంచాయతీ కార్యదర్శిగా ఎ.సుభద్ర.. రంగరాయపురం పంచాయతీ కార్యదర్శిగా ఎం.జయకుమారి.. శ్రీరాంపురం పంచాయతీ కార్యదర్శిగా బి.చంద్రకళ.. వీరభద్రపురం పంచాయతీ కార్యదర్శిగా సీహెచ్.స్వాతి.. దాసుళ్లపాలెం పంచాయతీ కార్యదర్శిగా ఎం.సత్యవతి.. తలారి పంచాయతీ కార్యదర్శిగా బి.సన్యాసినాయుడు.. రంగరాయపురం పంచాయతీ కార్యదర్శిగా పి.జగన్ బాధ్యతలు స్వీకరించినట్లు ఎంపీడీఓ సింగంపల్లి అప్పారావు తెలిపారు. అలాగే కొత్తవలస మండలంలో ఆరుగురు బదిలీపై వెళ్లగా వారి స్థానాల్లో కొత్తవారు విధుల్లో చేరారని ఎంపీడీఓ ఎస్.రమణయ్య తెలిపారు. చిన్నరావుపల్లి పంచాయతీ కార్యదర్శిగా వి.శిరీష్.. గులివిందాడ కార్యదర్శిగా యు.శ్యామ్‌సెల్వన్ జాకొబ.. నిమ్మలపాలెం పంచాయతీ కార్యదర్శిగా మహ్మద్ ఫిజిల్ రహమాన్.. వియ్యంపేట కార్యదర్శిగా కె.సుమలత.. సంతపాలెం కార్యదర్శిగా ఎం.రాజేశ్వరరావు.. దేశపాత్రునిపాలెం పంచాయతీ కార్యదర్శిగా పి.అజయ్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు.

అధ్వాన రహదారి..



చీపురుపల్లి నుంచి విజయనగరం వెళ్లే రహదారి అచ్యుతాపురం వద్ద గుంతలమయం కావడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గుంతలను తప్పించబోయి ఇప్పటికే చాలామంది ప్రమాదాల బారిన పడ్డారు. అధికారులు స్పందించి గుంతలను పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు.

– గుర్ల

ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి..



భీమసింగి వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం సందర్భంగా స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ప్రధానార్చకుడు వరప్రసాద్ ఆచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

– జామి

నైపుణ్యాలు తప్పనిసరి..



మహిళా రైతులకు గొర్రె పిల్లలను అందజేస్తున్న నార్మ్ డైరెక్టర్, అసోసియేట్ డీన్, తదితరులు

చీపురుపల్లి రూరల్ (గరివిడి): ప్రతి ఒక్కరూ నైపుణ్యాలను మెరుగుపరుచుకుని జీవనోపాధి పొందాలని ఐసీఏఆర్ నార్మ్ డైరెక్టర్ డాక్టర్ గోపాల్‌లాల్ మహిళా రైతులకు సూచించారు. గరివిడి వెటర్నరీ కళాశాలలో శాస్త్రీయ పద్ధతిలో గొర్రెలు, మేకల పెంపకంపై మహిళా రైతులకు మూడు రోజులుగా శిక్షణ ఇస్తున్నారు. శనివారం జరిగిన ముగింపు శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఈ శిక్షణ మహిళా రైతుల జీవనోపాధికి ఎంతోగానో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ మక్కేన శ్రీను, ప్రిన్సిపాల్ సైంటిస్ట్ డాక్టర్ బాలకృష్ణన్, సమన్వయకర్తలు డాక్టర్ శిరీష, డాక్టర్ జగదాంబ, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్ ద్వారా సత్వరన్యాయం

- స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ బుజ్జి



లోక్‌అదాలత్‌లో కేసులు రాజీ చేస్తున్న న్యాయమూర్తి

చీపురుపల్లి: జాతీయ లోక్‌అదాలత్ ద్వారా ఇరు వర్గాలకు సత్వర న్యాయం లభిస్తుందని విజయనగరం స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ (మొబైల్), చీపురుపల్లి లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ (ఎఫ్ఏసీ) పొన్నూరు బుజ్జి అన్నారు. శనివారం స్థానిక కోర్టు హాల్‌లో జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా క్రిమినల్ కేసులు 38, ప్రీ లిటిగేషన్ కేసులు 26, సమ్మరీ ట్రయల్ కేసులు 154, సివిల్ కేసులు 9 పరిష్కరించారు. అంతకుముందు ఏర్పాటు చేసిన న్యాయ అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ రాజీ మార్గాన్ని ఎంచుకోవడం ద్వారా ఎలాంటి వివాదాలు ఉండవని స్పష్టం చేశారు. కార్యక్రమంలో లీగల్ సర్వీసెస్ కమిటీ సభ్యులు నాగేంద్ర, శ్రీదేవి, న్యాయవాదులు పాల్గొన్నారు.



ఎస్.కోట: కోర్టులో లోక్‌అదాలత్ నిర్వహిస్తున్న దృశ్యం

47 కేసులు పరిష్కారం..

శృంగవరపుకోట: మండల న్యాయసేవా కమిటీ చైర్ పర్సన్, జూనియర్ సివిల్ జడ్జి బి.కనకలక్ష్మి నేతృత్వంలో శనివారం స్థానిక మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టులో నిర్వహించిన లోక్ అదాలత్‌లో 47 కేసులు పరిష్కారమయ్యాయి. సివిల్ కేసులు–8, చెక్‌బౌన్స్ కేసులు–6, క్రిమినల్ కేసులు–28, మనోవర్తి కేసులు–5 పరిష్కరించగా.. ద్వితీయ శ్రేణి మెజిస్ట్రేట్ కోర్టులో 292 పెట్టీ కేసులను సెకెండ్ క్లాస్ మెజిస్ట్రేట్ జి.అప్పలనాయుడు పరిష్కరించారు. అదాలత్‌లో సభ్యులు బి.సత్యనారాయణ, ఎం.అప్పారావు, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జి.సూరిదేముడు, బీవీఎస్ రామారావు, బొడ్డు వెంకటరావు, డబ్ల్యూఎస్ శర్మ, త్రిమూర్తులు, పలు బ్యాంక్‌ల మేనేజర్లు, పోలీస్, ఎక్సైజ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.హాజరయ్యారు.

రహదారి ఇలా.. రాకపోకలెలా..?

చీపురుపల్లి రూరల్ (గరివిడి): గరివిడి – గర్భాం రోడ్డు అధ్వానంగా మారడంతో రాకపోకలకు ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. గరివిడి పట్టణం నుంచి గర్భాం రోడ్డు పొడవునా ఇదే పరిస్థితి. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో కొత్త రోడ్లు నిర్మించి ప్రజలకు మంచి రవాణా సదుపాయాన్ని కల్పిస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చింది. అయితే నేటికీ చాలా రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. గరివిడి – గర్భాం రోడ్డు మీదుగా ప్రయాణం సాగించాలంటే ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో గోతుల్లో నీరు చేరడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ రహదారి మీదుగా నిత్యం వందల సంఖ్యలో ద్విచక్ర వాహనాలు, కార్లతో పాటు మెరకముడిదాం మండలంలో ఉన్నటువంటి మైనింగ్, ఫెర్రో అల్లాయీస్ కంపెనీలకు చెందిన లారీలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇదిలా ఉండగా చీపురుపల్లి నుంచి రాజాం వెళ్లే ప్రధాన రహదారిపై చీపురుపల్లి పట్టణంలో రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు జరుగుతున్నందున అటువైపుగా వెళ్లాల్సిన బస్సులు, లారీలు సైతం గర్భాం రోడ్డు మీదుగానే రాకపోకలు సాగిస్తున్నాయి. అధికారులు, పాలకులు స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



గరివిడి పట్టణంలో గొయ్యిలతో అధ్వానంగా ఉన్న గర్భాం రోడ్డు